సాక్షి
గుంటూరు

సోమవారం । 11 । ఆగస్టు । 2025



పోలేరమ్మ బోనాల ఉత్సవం

కారెంపూడి: బట్టువారిపల్లెలో పోలేరమ్మ బోనాల ఉత్సవం ఘనంగా జరిగింది. మహిళలు ఆదివారం ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి, పోతురాజుకు నైవేద్యం సమర్పించారు.



పార్వతీదేవికి పూజలు

అమృతలూరు(భట్టిప్రోలు): గోవాడలోని బాల కోటేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



పిడుగురాళ్ల: పట్టణం లోని గంగమ్మ తల్లిని ఆదివారం పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మధురాన్నం.. మా రాజు!

- గుంటూరు జీజీహెచ్‌లో నాలుగేళ్లుగా కార్యక్రమం
- మధురాన్నం సొసైటీ పేరుతో పంపిణీ
- ప్రతి రోజూ వెయ్యి మందికిపైగా లబ్ధి
- ఇంటి భోజనాన్ని తలపించేలా జాగ్రత్తలు
- ఐదో వసంతంలోకి మహోన్నత సేవలు

చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు ఉచిత భోజనం

అన్నదానం.. ఎంతో పుణ్యకార్యం. ఆకలితో ఉన్న వారికి ఒక పూట భోజనం పెడితే రెండు చేతులెత్తి నమస్కరిస్తారు. ఇలా ఒకరికి కాదు... ఒక పూట కాదు... ఎంత మందికైనా, ఎన్ని రోజులైనా ఉచితంగా భోజనం పెట్టేందుకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు చల్లని మనస్సుతో ముందుకొచ్చారు. ఈ బృహత్తర కార్యక్రమానికి గుంటూరు జీజీహెచ్ వేదికగా నిలిచింది. ఈ పుణ్యకార్యాన్ని ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయ్యాయి. ఐదో ఏడాదిలోకి అడుగుపెట్టిన ఆ సేవలు ఎందరికో కడుపు నింపాయి.

గుంటూరు మెడికల్: కరోనా.... ఈ పేరు వింటేనే ప్రపంచం వణికిపోయింది. మూడేళ్లపాటు లక్షలాదిమంది ప్రాణాలు బలి తీసుకున్న ఆ మహమ్మారి సమయంలో ఆకలి కేకలు పట్టించుకునే వారు కూడా లేరు. మరో పక్క రోగాలతో చికిత్స పొందుతున్న వారికి సహాయకులుగా వచ్చి పట్టెడు అన్నం దొరక్క ఎంతో మంది నిత్యం ఆకలితో అలమటించారు. ఆ సమయంలో పెద్దాయన మనస్సు చలించింది. తాను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉండి వారి ఆకలి తీర్చలేకపోతే ఎలా అంటూ ముందుకొచ్చారు. కరోనాను లెక్కచేయకుండా రోగుల సహాయకులకు ఉచిత భోజనం దగ్గరుండి పెట్టించారు. మధురాన్నం సొసైటీ పేరుతో 2021 జులై 4న ప్రారంభించిన ఆ మహత్తర పుణ్యకార్యం నాలుగేళ్లు పూర్తి చేసుకుంది. ఐదో ఏడాదిలోనూ అమూల్య సేవలు కొనసాగుతూనే ఉన్నాయి.

శాశ్వత భోజనశాల ఏర్పాటు

గుంటూరు జీజీహెచ్‌కు రోజూ ఐదు జిల్లాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది ఓపీ వైద్య విభాగానికి చికిత్స కోసం వస్తున్నారు. ఒక్కో రోగికి తోడుగా ఒకరు లేదా ఇద్దరు ఉంటున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యే రోగులకు ప్రభుత్వం ఉచితంగా భోజనం పెడుతుంది. సహాయకులు బయటే తినాలి. కరోనా సమయంలో జీజీహెచ్‌లో పరిస్థితిని పరిశీలించేందుకు నాటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు వచ్చారు. నాడు ఆయన చూసిన దృశ్యాలే నేడు రోగుల సహాయకుల భోజనశాల ఏర్పాటుకు, ఉచిత భోజనం పెట్టేందుకు నాంది పలికాయి. అప్పుడు హోటళ్లు మూసివేయడం, ఇళ్ల నుంచి ఆస్పత్రులకు వచ్చేందుకు ఆంక్షలు ఉండటంతో రోగుల సహాయకులు ఇబ్బంది పడ్డారు. దీంతో ఆస్పత్రిలో రూ.25 లక్షలతో నిర్మించిన ఏపీఎన్‌జీఓ భవనం వినియోగంలోకి రాకుండా ఉండటం ఆయన దృష్టికెళ్లటంతో వారితో సంప్రదించారు. ఓ మంచి పనికి తమ భవనం ఉపయోగపడుతుందని అసోసియేషన్ నేతలు ఆనందంగా అంగీకారం తెలిపారు. మాజీ మంత్రి దగ్గరుండి రోగుల సహాయకుల భోజనశాల నిర్మాణ పనులు చేయించారు. వేడిగా ఆహార పదార్థాలు ఉండేలా కోయంబత్తూరు నుంచి వంటి సామగ్రిని రప్పించారు. అత్యాధునిక సౌకర్యాలతో భోజనశాల సిద్ధమైంది. నిత్యం ఇంటి భోజనాన్ని తలపించేలా వేడిగా భోజనం వడ్డిస్తున్నారు.



భోజనం తింటున్న సహాయకులు



క్యూలైనులో రోగుల సహాయకులు

తాతల కాలం నుంచే సేవ

తండ్రి చెరుకువాడ నరసింహమూర్తిరాజు, వారికంటే ముందు తరాల వారి నుంచి శ్రీరంగనాథరాజు స్వస్థలమైన పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం, ఎండగండి గ్రామంలో రోజూ పేదలకు ఉచిత భోజనం పెడుతూనే ఉన్నారు. మరింత మందికి ప్రయోజనం కలిగేలా శ్రీరంగనాథరాజు జీజీహెచ్‌లో ఈ సేవలు విస్తరించారు.

రూ.కోటి విరాళం ఇచ్చి మరీ..



మధురాన్నం భోజనశాల

పుణ్యకార్యం నిరంతరం కొనసాగేందుకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు రూ.కోటి అందించారు. ప్రేమగా, రుచిగా భోజనం పెట్టేందుకు సొంత ట్రస్ట్ 'మధురాన్నం' ద్వారా సేవలు అందిస్తున్నారు. రోజూ రెండు పూటలా ఇక్కడ వంట వండుతున్నారు. రోజూ 1,000 -1,500 మందికి భోజనం పెడుతున్నారు. ఒకేసారి 300 మంది కూర్చుని తినొచ్చు. మధ్యాహ్నం 12 - 2, రాత్రి 7- 8.30 గంటల వరకు భోజనం పెడతారు. రోగులకు, వారి సహాయకులకు, వార్డులో పనిచేస్తున్న సిబ్బందికి ఉచిత పాస్ ఇస్తారు. ఈ పాస్ చూపితే జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ ఎదురుగా ఉన్న మధురాన్నం సొసైటీ భోజనశాలలో ఉచితంగా భోజనం పెడతారు. ఈ తరహా సేవా కార్యక్రమంలో రాష్ట్రంలో మొట్టమొదటిసారి ఇక్కడ కొనసాగుతోంది. అన్నం, పప్పు, పచ్చడి, రసం, మజ్జిగ, సాంబారు, కూర వడ్డిస్తారు. పది మందికి పైగా సిబ్బంది ఇంటి భోజనాన్ని మరిపించేలా రుచికరమైన ఆహారాన్ని వండి పెడుతున్నారు. ప్రతినెలా సుమారు రూ. 10 లక్షల వరకు దీనికోసం మాజీ మంత్రి ఖర్చు పెడుతున్నారు.

వారి కష్టాలు చూసే 'ఉచిత భోజనం'



గుంటూరు జీజీహెచ్‌కు ఐదు జిల్లాల రోగులు వైద్యం కోసం వస్తున్నారు. కరోనా సమయంలో రోగుల సహాయకులు భోజనం కోసం పడుతున్న అవస్థలు చూశాను. సహాయకులకు తృప్తిగా ఉచిత భోజనం పెట్టాలని ఆనాడే అనుకున్నాను. పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం.

– మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఇంటి భోజనంలా ఉంది



నేను వారం రోజులుగా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న మా బంధువు బుజ్జి వద్ద ఉంటున్నాను. ఆసుపత్రిలో ఉచిత భోజనం పెడుతున్న విషయం తెలుసుకుని ఇక్కడే తింటున్నాను. ఇంటి భోజనంలా ఉంది. మధురాన్నం నిర్వాహకులకు ధన్యవాదాలు.

– పూనం వెంకట్రావు, భద్రాచలం

ఎంతో రుచికరం



నా కుమారుడు నరేంద్ర జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతడి వద్ద ఉంటున్న నాకు బయటకు వెళ్లి భోజనం కొనుక్కునే స్థోమత లేదు. ఆసుపత్రిలో ఉచిత భోజనం పెడుతున్నారని తెలుసుకుని, ఇక్కడ తింటున్నాను. భోజనం రుచికరంగా బాగుంది.

– చుక్కా పోలమ్మ, 113 త్యాళ్లూరు



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

న్యూస్‌రీల్

ఆర్టీసీ డిపోలో వసతుల కల్పనకు కృషి



తెనాలిఅర్బన్: ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి ఆర్టీసీ డిపోను ఆదివారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడారు. ఈ నెల 15 నుంచి స్త్రీశక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. విజయవాడకు 19, గుంటూరుకు 34 సర్వీసులను మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీ



తెనాలి: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పచ్చకామెర్లకు చికిత్స తీసుకుంటున్న రోగితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 30–40 మంది రోగులతో మాట్లాడానని, వారంతా ఆసుపత్రిలో వైద్యసేవలతో సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి చెప్పారు. రోగనిర్ధారణకు వినియోగించే సీటీ స్కాన్ చెడిపోయి చాలా కాలమైనా కొత్త పరికరం ఏర్పాటు చేయకపోవటం తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

ఘనంగా దివ్యబలిపూజ



విజయపురి సౌత్: ప్రతి ఒక్కరూ దేవునిపై విశ్వాసంతో జీవించాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాల సాగర్ ఉద్బోధించారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజ కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. తోటివారిని ప్రేమించటం క్రైస్తవ్యంలో ప్రధానమన్నారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఏసు ప్రభువును ఈ ప్రపంచానికి అందించిన దివ్యమూర్తి మేరిమాత అని కొనియాడారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో భక్తులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి విరాళాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై ఉన్న కనక దుర్గమ్మ ఆలయానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన శీల రమ్య కుటుంబం అమ్మవారి నిత్యాన్నదాన పథకానికి రూ. 5,01,116 విరాళాన్ని ఆలయ అధికారులకు ఇచ్చారు. గుంటూరు పట్టాభిపురానికి చెందిన విజయ్ శైలేంద్ర అమ్మవారి ఉచిత ప్రసాద పంపిణీకి రూ. 90 వేలు విరాళాన్ని అందజేశారు. డోనర్ సెల్‌కు రూ.10 వేల విలువైన బీరువాను అందించారు. తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన బాలా ప్రగడ ఎస్ఎస్ కామేశ్వరి కుటుంబం దుర్గగుడి అభివృద్ధి పనులకు రూ.1,07,900 విరాళాన్ని అందజేసింది.

హోరాహోరీగా అథ్లెటిక్స్ పోటీలు



చీరాల: అంతర్ జిల్లాల 36వ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు స్థానిక వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కళాశాలలో హోరాహోరీగా జరుగుతున్నాయి. బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పోటీల్లో 1500 మంది బాలబాలికలు పాల్గొన్నారు. చీరాలలో మొదటిసారిగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించడంతో తిలకించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఆర్గనైజింగ్ కమిటీ తరపున అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్.. డైవర్షన్..



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్

శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి కూల్చివేత నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): దశాబ్దాల చరిత్ర ఉన్న గుంటూరులోని శంకర్‌విలాస్ ఓవర్ బ్రిడ్జి కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ట్రాఫిక్ మళ్ళింపు చేపట్టారు. ఈ నెల 9వ తేదీన బ్రిడ్జి కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టారు. 9వ తేదీ రెండో శనివారం, 10వ తేదీ ఆదివారం కావటంతో కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర కార్యాలయాలకు సెలవులు రావటంతో పెద్దగా ట్రాఫిక్ ప్రభావం లేదనే చెప్పాలి. ఈ క్రమంలో సోమవారం నుంచి ట్రాఫిక్ రద్దీ భారీగా ఉండే అవకాశం ఉంది. కొద్ది నెలల కిందట మూడు వంతెనలు పనులు జరిగిన నేపథ్యంలోనే ట్రాఫిక్‌కు ఎంత అంతరాయం ఏర్పడిందో నగర ప్రజలకు తెలియంది కాదు. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ ఆదేశాలు మేరకు ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన డైవర్షన్‌లు ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉంది. అందుకు తగ్గట్టుగా ట్రాఫిక్ పోలీసులు ఎక్కిడికక్కడ బారికేడ్లతో రోడ్లను మూసి, డైవర్షన్ తెలిపేందుకు సిబ్బందిని కూడా కేటాయించారు. అలాగే డైవర్షన్ తెలిపే సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా స్టేషన్‌ల నుంచి డిప్యూటేషన్‌లపై సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణకు రంగంలోకి దించారు.

ప్రజల సహకారం అవసరం



శంకర్‌విలాస్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ పనుల నేపథ్యంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఇప్పటికే ఒకటికి పలుమార్లు నగరాన్ని పరిశీలించటంతో పాటు అనేక చర్యలు తీసుకున్నాం. అధికారులకు సైతం తీసుకోవాల్సిన చర్యల గురించి తగు ఆదేశాలు జారీ చేశాం. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరం. రద్దీ ఉండే ప్రాంతాల్లో అధికంగా సిబ్బందిని పెట్టి, ట్రాఫిక్ నిలువకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమైన పాయింట్‌లు గుర్తించి కావాల్సిన చర్యలు తీసుకున్నాం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ సజావుగా సాగేలా దృష్టి సారించాం.

– ఎస్.సతీషకుమార్, జిల్లా ఎస్పీ

వెస్ట్ వైపు నుంచి రాకపోకలు ఇలా....

- అమరావతి రోడ్డు నుంచి మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా (ఎంటీబీ) సెంటర్ వైపు వెళ్ళే వాహనాలు చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు మార్గంలో ప్రయాణించాలి.
- లాడ్జిసెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్‌కు వెళ్ళే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అరండల్‌పేట, పొట్టి శ్రీరాములు నగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు, లేని పక్షంలో బ్రాడీపేట, కంకరగుంట ఫ్లై ఓవర్, మార్గంలో అటు, ఇటు ప్రయాణించాల్సిన అవసరం ఉంది.
- హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వైపు వచ్చే వాహనాలు (స్కూల్ బస్సులతో సహా) రమేష్ హాస్పటల్, కంకరగుంట బ్రిడ్జి మార్గాన్ని వినియోగించుకోవాలి.
- కోబాల్టుపేట, కృష్ణనగర్, చంద్రమౌళీ నగర్, బృందావన్‌గార్డెన్స్, లక్ష్మీపురం ప్రాంతాల నుంచి మార్కెట్ వచ్చే వాహనాలు, బ్రాడీపేట 18వ అడ్డ రోడ్డు, కంకరగుంట అండర్‌పాస్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, రమేష్ ఆసుపత్రి మీదుగా చేరుకోవాలి.
- పట్టాభిపురం నుంచి జీజీహెచ్‌కు వెళ్ళే వారు కంకరగుంట బ్రిడ్జి, ఎంటీబీ సెంటర్, ఉమెన్స్ కళాశాల రోడ్డు, పల్లవి థియేటర్ రోడ్డులో ప్రయాణించాలి.
- లాడ్జిసెంటర్- ఎంటీబీ సెంటర్ వైపు వెళ్ళే హెవీ వెహికల్స్ చిల్లీస్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఆటోనగర్, బస్టాండ్, కంకరగుంట బ్రిడ్జి మీదుగా వెళ్ళాలి.

గుంటూరు ఈస్ట్ నుంచి ఇలా..

- ఓల్డ్ క్లబ్ రోడ్డు, రామిరెడ్డితోట, నెహ్రూనగర్, బుచ్చయ్య తోట, మణిపురం ప్రాంతాలకు చెందిన ప్రజలు మూడు వంతెనలు మీదుగా డొంక రోడ్డు వైపు నుంచి శ్రీనగర్ మీదుగా అమరావతిరోడ్డు చేరుకోవాలి.
- క్లాత్‌బజారు, రైలుపేట, సాంబశివరావుపేట, నాజ్‌సెంటర్ చుట్టుపక్కల వారు భాస్కర్ డీలక్స్, మూడు వంతెనల మీదుగా గుంటూరు వెస్ట్‌లోకి వెళ్ళాలి.
- ఉమెన్స్ కాలేజీ, విజ్ఞాన మందిరం సెంటర్, మార్కెట్ ప్రాంతాల వారు రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా జిల్లా కోర్టు వైపు నుంచి కంకరగుంట బ్రిడ్జి మీదుగా వారి రాకపోకలు సాగించవచ్చు.
- ఆర్టీసీ బస్టాండ్, పాతగుంటూరు , లాలాపేట, పట్నం బజారు, పరిసర ప్రాంతాల వారు హిందూ కళాశాల కూడలి మీదుగా మూడు బొమ్మల సెంటర్, పట్టాభిపురం వైపు ప్రాంతాలకు వెళ్ళవచ్చు.
- మంగళగిరి రోడ్డు, కాకాని రోడ్డు, మంగళదాస్‌నగర్ ప్రాంతాల వారు ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా అమరావతి రోడ్డుకు చేరుకోవాలి.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

జె.పంగులూరు: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అలవలపాడు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. రేణింగవరం పోలీసులు అందించిన వివరాల మేరకు.. ఇంకొల్లు మండలం హనుమోజీ పాలేనికి చెందిన అత్తులూరి ధనుంజయరావు (45) భార్య మహోన్నతితో కలిసి గ్రామం నుంచి మోటార్ సైకిల్‌పై కొరిశపాడు మండలం బొడ్డువాని పాలెం గ్రామంలో బంధువుల వివాహ వేడుకకు హాజరయ్యారు. తిరిగి జాతీయ రహదారి వెంబడి హనుమోజిపాలెం బయలు దేరారు. అలవలపాడు వద్ద క్రాస్ రోడ్డు దాటుతుండగా, గుంటూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్న కారు ఢీకొట్టడంతో బైక్‌పై వెళుతున్న దంపతులు కింద పడ్డారు. తీవ్రగాయాలపాలైన ధనుంజయరావు అక్కడికక్కడే మృతి చెందగా, భార్యకు గాయలు కాగా ఒంగోలు వైద్యశాలకు తరలించారు. మృతుడు చీరాల మండలం ఈపురుపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునికి పనిచేస్తున్నారు. సంఘటనపై ఎస్సై వినోద్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.



ధనుంజయరావు మృతదేహం

రైల్వే శాఖలో శరవేగంగా అభివృద్ధి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

తెనాలి టౌన్: దేశంలోని విమానాశ్రయాలకు దీటుగా రైల్వే శాఖను శరవేగంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రధాని పనిచేస్తున్నారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం తెనాలి రైల్వే స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా తెనాలి రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు రూ.27 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. ముందుగా ఒకటో ప్లాట్‌ఫాంపై పనులను పరిశీలించారు. ప్రయాణికులను అడిగి స్టేషన్‌లో సౌకర్యాలు ఆరా తీశారు. నూతనంగా వేసిన టైల్స్ నాసిరకంగా ఉండటాన్ని గుర్తించి అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. రూ.12 కోట్ల నిధులతో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, వెయిటింగ్ హాల్, మాడ్యులర్ టాయిలెట్స్, 3 లిఫ్టులు, ఆరు ఎస్కలేటర్ల నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. డిసెంబర్ 25వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు.

రైళ్లకు స్టాప్ కోసం ప్రయత్నాలు

పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు గుంటూరు నుంచి తెనాలి వరకు ఎక్స్‌టెన్షన్ చేపట్టే ఆలోచన ఉన్నట్లు చెప్పారు. సంగమిత్ర ఎక్స్‌ప్రెస్‌కు తెనాలి స్టాప్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

సికింద్రాబాద్, తిరుపతి మధ్య వందే భారత్ రైలుకు కూడా తెనాలిలో స్టాప్ అడుగుతున్నట్లు చెప్పారు. రైల్వే మంత్రితో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్టేషన్ ముందు తూర్పు భాగంలో మరిన్ని ఆధునికీకరణ పనులు చేయాల్సి ఉందని వివరించారు. వెహికల్ పార్కింగ్‌కు అనువుగా పనులు చేపడతామని తెలిపారు. పనుల నాణ్యతలో రాజీపడేది లేదని అన్నారు. కొన్ని డిజైన్లు మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్టేషన్ పరిసరాల్లో గంజాయి బ్యాచ్ తిరుగుతున్నట్లు కొందరు మంత్రి దృష్టికి తీసుకురాగా.. చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎఫ్ సీఐను ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, సెంట్రల్ సీనియర్ డివిజనల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు, రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ అడిషనల్ జనరల్ మేనేజర్ ఎస్‌ఏకే బాషా, బాపట్ల ఏడీఈఎన్ కె.శ్రీనివాసరావు, సీపీడబ్ల్యూఐ – తెనాలి జి.కిరణ్‌బాబు, స్టేషన్ మేనేజర్ టి.వెంకటరమణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

బౌద్ధస్తూపం పరిరక్షణకు చర్యలేవీ?

- ఎంతో విశిష్టత కలిగిన భట్టిప్రోలు బౌద్ధ ఆరామం
- అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకుని పర్యాటక ప్రాంతం
- సందర్శకులకు కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని అతి ప్రాచీన బౌద్ధ స్తూపం సరైన ఆలనాపాలన లేకుండా నిరాదరణకు గురవుతోంది. బుద్ధుని అస్థికలపై ఏర్పాటు చేసిన ఈ స్థూపంపై చాలామంది కాలక్షేపం చేస్తున్నారు. మరికొందరు ఆటలాడుతున్నారు. దాదాపు 3 వేల సంవత్సరాల క్రితం భట్టిప్రోలు వాణిజ్య, విద్యా కేంద్రంగా విరాజిల్లింది. రాష్ట్రంలోని అన్ని బౌద్ధ స్తూపాల్లోకెల్లా ఇది అతి పురాతనమైనది.

మౌలిక వసతులు కరువు

బౌద్ధస్తూపం అభివృద్ధి పనులు ఎలా ఉన్నా.. దీనిని వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులకు కనీస సౌకర్యాలు కూడా లేవు. స్తూపం ముందు భాగంలో గార్డెనింగ్‌పై దృష్టి సారించిన పురావస్తు, ఆర్కియాలజీ శాఖాధికారులు వసతుల కల్పన విషయాన్ని విస్మరించడం శోచనీయం. ఇంత వరకు అండర్ పోర్షన్ మాత్రమే పూర్తయింది.

శిలాఫలకానికే పరిమితం

బౌద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని టీడీపీ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2016 మే 19న శ్రీకారం చుట్టింది. స్తూపం ఆవరణలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (జేతవనం ప్రాజెక్ట్) ఆధ్వర్యంలో రూ.60 లక్షలతో 40 అడుగుల ఎత్తైన బుద్ధుని విగ్రహం, బోటు షికారు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకం అలానే ఉంది. పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

పాముల సంచారంతో భయం

బౌద్ధక్షేత్రం తిలకించేందుకు పర్యాటకులు వచ్చినప్పుడు పాములు కనిపించడంతో పరుగులు తీస్తున్న ఘటనలు జరుగుతున్నాయి. ఈ క్షేత్రం నిర్వాహణపై అధికారుల పట్టింపు కరువైంది. ఆవరణ అంతా పిచ్చి గడ్డి పెరిగింది. వర్షం కురిస్తే ఆవరణలో భారీగా నీరు నిల్వ ఉంటోంది.



భట్టిప్రోలు బౌద్ధస్తూపం

క్లుప్తంగా

లైవ్‌స్టాక్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా అనిల్‌కుమార్



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర కోశాధికారిగా గుంటూరుకు చెందిన చప్పిడి అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర కోశాధికారిగా ఎన్నికైన అనిల్‌కుమార్‌ను నాన్‌గెజిటెడ్ వెటర్నరీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ సేవానాయక్, జిల్లా చైర్మన్ రాజమోహన్, ఏపీఎన్‌జీజీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా సెక్రటరీ శ్యామ్ సుందర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ షేక్ నాగూర్‌షరీఫ్, నగర అధ్యక్ష కార్యదర్శులు సూరి, కళ్యాణ్, ఇతర సంఘ నేతలు అభినందనలు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు 6,908 క్యూసెక్కులు విడుదల



దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆదివారం 6,908 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు 290, బ్యాంక్ కెనాల్‌కు 1,820, తూర్పు కాలువకు 664, పశ్చిమకాలువకు 285, నిజాంపట్నం కాలువకు 460, కొమ్మూరు కాలువకు 3,060 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజి నుంచి సముద్రంలోకి 50,750 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

మొక్కజొన్న వ్యాపారిని మోసం చేసిన తండ్రీకొడుకులు

తెనాలిరూరల్: మొక్కజొన్న, జొన్నల వ్యాపారం చేసే తండ్రీకొడుకులు నంద్యాలకు చెందిన వ్యాపారిని మోసం చేయడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటకు చెందిన గోగినేని సత్యనారాయణ, అతని కొడుకు శ్రీకాంత్ మొక్కజొన్న, జొన్నల వ్యాపారాలు చేస్తుంటారు. నంద్యాలకు చెందిన వ్యాపారి శ్రీనివాస్ వద్ద రూ.20 లక్షలు తీసుకుని సరుకు ఇవ్వకుండా మోసం చేశారు. దీనిపై బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్లు త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

జె.పంగులూరు: మండలంలోని రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పర్వతరెడ్డి వెంకటస్వామి (52) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. వెంకటస్వామి రేణింగవరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతని స్వగ్రామం చిన్నగంజాం మండలం సోపిరాల. ఆయన అస్వస్థతకు గురికావడంతో ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వెంకటస్వామికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అంగన్‌వాడీలకు యాప్‌సోపాలు

- బాలింతలు, గర్భిణుల గుర్తింపునకు అవస్థలు
- లబ్ధిదారుల ముఖ గుర్తింపునకు ముప్పుతిప్పలు
- పాత ఫోన్లతో తలనొప్పులు
- నెట్ వర్క్ లేక బాలసంజీవని, పోషణ ట్రేకర్ అప్‌లోడ్ సమస్య



అంగన్‌వాడీలకు ఇచ్చే పౌష్టికాహారం

నెహ్రూనగర్: అంగన్‌వాడీ కార్యకర్తలు యాప్‌లతో ఆపసోపాలు పడుతున్నారు. పాత ఫోన్లలో ముఖ చిత్ర గుర్తింపునకు పడరానిపాట్లు పడుతున్నారు. లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాలంటే తప్పనిసరిగా ముఖ చిత్ర గుర్తింపు చేయాల్సిందే. అలా చేయకుండా ఆహార పదార్థాలను అందించలేరు. యాప్‌లు సరిగ్గా పనిచేయకపోవడంతో సకాలంలో ముఖ చిత్ర గుర్తింపు ప్రక్రియ జరగకపోవడంతో ఇటు లబ్ధిదారులు, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బాధలు పడలేని అంగన్‌వాడీ కార్యకర్తలు ఇటీవలే గుంటూరు అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

ప్రాథమిక విద్యా బోధనకు ఆటంకం

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో 12 రకాల రికార్డులు నిర్వహించాల్సి వస్తోంది. లబ్ధిదారులకు అందించే ఆహార వినియోగం, పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నమోదు చేసే రికార్డులు (ఎస్ఎన్ఎస్), ప్రీ స్కూల్ అడ్మిన్ విద్యార్థుల వివరాలు ప్రతి నిత్యం విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. వాటితోపాటు పిల్లలకు అందించే టీకాలకు సంబంధించిన రిజిస్టర్, విటమిన్–ఎ రికార్డు, రిఫరల్ సరీ్వసెస్ గృహ సందర్శకుల రికార్డులు నిర్వహించాలి. వీటితోపాటు నెలవారీ ప్రాజెక్టు (ఎంటీఆర్), ఆయా అంగన్‌వాడీల పరిధిలోని గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టులతోపాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించి టేక్ హోమ్ రేషన్ పంపిణీ రికార్డు, స్టాఫ్ అడ్మిషన్ రిజిస్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. పని ఒత్తిడి వల్ల పిల్లలకు ప్రాథమిక విద్య బోధించేందుకు సమయం సరిపోవడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు.

పనిచేయని పాత ఫోన్లు

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన మొబైల్ ఫోన్లు పాతవి కావడంతో నెట్‌వర్క్ కష్టాలు అధికంగా ఉంటున్నాయి. మొబైల్స్ ర్యామ్ తక్కువగా ఉండటంతో తక్షణమే యాప్ స్పందించక తిప్పలు తప్పడం లేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్ నమోదులో ఆలస్యమైతే అధికారుల వేధింపు ఎక్కువ య్యాయని వాపోతున్నారు.

సాగని పోషకాహార పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు వయసున్న బాలలకు ప్రతి నెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషకాహారం ఇచ్చేవారు. ఎక్కువ మంది తమకు ఇంటి వద్దకే పోషకాహారం కావాలంటూ ప్రభుత్వాన్ని అభ్యర్థించడంతో టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్)గా మార్చారు. పాలు, కోడిగుడ్లు, నూనె, పప్పు దినుసులు, బియ్యం వంటివి ప్రతి నెలా రెండు దఫాలుగా అందిస్తున్నారు. ఇవన్నీ పంపిణీ చేయాలంటే వారందరి పూర్తి వివరాలను పోషణ యాప్ ద్వారా రెండుసార్లు నమోదు చేయాల్సి ఉంది. టీహెచ్ఆర్ కోసం ఒకే లబ్ధిదారును రెండుసార్లు ముఖ యాప్ ద్వారా గుర్తించాల్సి రావడం కూడా ఇబ్బందికరంగా మారిందంటున్నారు. నెలలో ఎక్కువ సమయం ఈ పనికే వినియోగించడం వల్ల చిన్నారుల ప్రాథమిక విద్య బోధనకు ఇబ్బందిగా మారిందని కార్యకర్తలు అంటున్నారు.



యాప్‌లో ఎఫ్ఆర్ఎస్ తీసుకుంటున్న అంగన్‌వాడీ కార్యకర్త

5జీ ట్యాబ్‌లు ఇవ్వాలి

అంగన్‌వాడీ కార్యకర్తలకు గతంలో ఇచ్చిన ఫోన్లలో ప్రస్తుత యాప్‌లు పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఒక పక్క లబ్ధిదారుల ఫేక్ క్యాప్చర్ జరిగితేనే పౌష్టికాహారం ఇవ్వాల్సి ఉంది. యాప్‌లు పనిచేయక పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు అధికారులు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయాలి. దీంతో అంగన్‌వాడీలు మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి 5జీ ట్యాబ్స్ ఇవ్వాలి.

– దీప్తి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం

- రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో "వార్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్" ప్రాజెక్టుకు రూపకల్పన
- ఈనెల 12న గుంటూరులో ప్రారంభించనున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



వాడి పారేసిన వాటర్ బాటిళ్లను సేకరించేందుకు ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటిస్తూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కోశాధికారి పి.రామచంద్రరాజు ఆదివారం తెలిపారు. గుంటూరు అర్బన్ పరిధిలో అన్ని యాజమాన్యాల్లోని 540 పాఠశాలల్లో 3వ తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న 50 వేల మంది విద్యార్థులను భాగస్వాములను చేస్తూ చేపట్టిన "వార్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్" ప్రాజెక్టును ఈనెల 12న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గుంటూరు నగరంలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రారంభించనున్నారని వివరించారు. ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులతో పర్యావరణానికి వాటిల్లుతున్న హాని, కాలుష్యాన్ని నివారించేందుకు దేశంలోనే మొట్టమొదటిసారిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఒక్కసారి ఉపయోగించుకుని రోడ్డు పక్కన పడవేసే ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించిన నేపథ్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సేకరించేందుకు ప్రాజెక్టు ద్వారా రూపకల్పన చేశామని చెప్పారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆవుల తిరుమలేష్, బి.సత్యం ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా సీజే మణికుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా షేక్ జిలాని బాషా, కోశాధికారిగా పుట్టా అప్పారావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గుత్తా శ్రీనివాసరావు, జె.కమల ప్రసాద్, ఎం.ఏడుకొండలు, మహిళా ప్రతినిధిగా జోస్ మేరీ, తెనాలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.శ్రీధర్, బి.రాజీవ్ రతన్, గుంటూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.నగేష్, జయప్రద, మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా కె.రాజారెడ్డి, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల ప్రతినిధిగా జి.శ్రీనివాసరావులను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆవుల తిరుమలేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

'తొలితరం తెలుగు రచయిత్రులు' పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ తదితరులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కల్యాణవేదికపై ఆదివారం ప్రముఖ సాహితీవేత్త, ఆచార్య సీహెచ్.సుశీలమ్మ రచించిన తొలితరం తెలుగు రచయిత్రులు అభ్యుదయ కథల పుస్తకావిష్కరణ నిర్వహించారు. కేంద్ర సాహితీ అకాడమి అనువాద పురస్కార గ్రహీత పి.సత్యవతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంకా సూర్యనారాయణకు అంకితం చేసి సత్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సభలో గ్రంథాన్ని విశ్లేషిస్తూ కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ప్రసంగించారు. ఈ పుస్తకంలో వితంతు, స్త్రీల బాధలను, వాటి వెనుకనున్న సామాజిక దుర్మార్గాన్ని, అస్పృశ్యత, అంటరానితనం, అగ్రవర్గ దురహంకారం వంటి అనేక విషయాలను ప్రస్తావించడం విశేషమని అన్నారు. ఈ పుస్తకంలో 1902 నుంచి 1955 వరకు రచించిన కథ, రచన చేసిన 25 మంది కథారచయిత్రుల రచనలను పరిచయం చేయడంతో పాటు రచయిత్రుల జీవన రేఖలను అందించడం మంచి విశేషమని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తకావిష్కరణ సత్యవతి, సుశీల, రచయిత్రి అతిథులను సత్కరించారు.

హామీల అమలు ఎప్పుడో చెప్పాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీల అమలు ఏమయ్యాయనే సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షతన ఎస్టీయూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో డీఏలు ఇస్తామని, మెరుగైన వేతన సవరణ చేస్తామని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీల అమలును ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

- సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ బోధనేతర పనులు మితిమీరి, ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, దీని ప్రభావం బోధనపై పడే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే సీపీఎస్ విధానం రద్దు చేయాలని, తెలుగు రాష్ట్రంలో తెలుగు మాధ్యమం తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.
- ఏఐఎస్టీఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ 2003–డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదోతరగతి పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పాల్గొన్నవారికి ఇంతవరకు పారితోషికం చెల్లించకపోవడం అన్యాయమన్నారు.
- ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె. కోటేశ్వర రావు మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, ఉద్యమాలు చేయాల్సిన అనివార్య పరిస్థితులు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
- సంఘ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ రకరకాల యాప్‌ల పేరుతో టీచర్లు బోధనేతర పనులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.
- సంఘ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదరి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాల నుంచి పొదుపు చేసుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ ఖాతాల నుంచి రుణాల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు.

సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యస్.రామచంద్రయ్య, షేక్ మహబుబ్ సుభాని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, పల్నాడు, బాపట్ల జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ రామిరెడ్డి, యు.చంద్రజిత్ యాదవ్, బడుగు శ్రీనివాస్, జి.అమర్నాథ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వి.భిక్షమయ్య, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆంగ్ల భాషా బోధనపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న గుంటూరు ప్రభుత్వ ఉపాధ్యాయులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధిలో భాగంగా విల్ టు కెన్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ ఆంగ్లభాషా బోధన శిక్షణ కొనసాగుతోంది. గుంటూరు జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు 40 రోజుల ఆన్‌లైన్ శిక్షణలో భాగంగా ఆదివారం ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విల్ టు కెన్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థి తెలుగులో మాట్లాడినంత సులభంగా ఆంగ్లంలో మాట్లాడేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. ఇప్పటికే విద్యాశాఖ సహాయంతో తొలుత విశాఖ, అన్నమయ్య జిల్లాలో శిక్షణను విజయవంతంగా ముగించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా 9 జిల్లాల్లోని 18 వేల మంది ఉపాధ్యాయులకు ఆంగ్ల భాష బోధనపై శిక్షణ అందించామన్నారు. ఇంతకు ముందు తెలంగాణలోనూ సైతం 53 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. ఏపీలోనూ అదే స్ఫూర్తితో శిక్షణ కొనసాగిస్తున్నట్టు వివరించారు. గుంటూరులో మూడు జిల్లాలకు చెందిన సుమారు 3 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఇందుకు సహకరించిన డీఈవో, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాభీష్టం మేరకు బ్యాలెట్ విధానం మంచిదే

- తెలంగాణ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి
- గుంటూరులో రాజ్యసభ మాజీ సభ్యుడు శివాజీకి పరామర్శ



యలమంచిలి శివాజీతో మాజీ మంత్రి జానారెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టడం మంచి పరిణామమేనని, ఈ విషయంలో ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలని తెలంగాణ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఆదివారం గుంటూరులో నగరం బృందావన్‌గార్డెన్స్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ నివాసానికి వచ్చిన జానారెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్సీ కేతావతు శంకర్‌నాయక్‌లు అనారోగ్యానికి గురైన శివాజీని పరామర్శించారు. ఈసందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ ఆత్మీయ మిత్రుడు శివాజీని కలుసుకోవడం ఆనందంగా ఉందని, రైతాంగ సమస్యలపై ఆయనతో కలిసి పని చేశానని గుర్తు చేశారు. యువతరం రాజకీయాల్లోకి రావాలని, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని అన్నారు. ఎన్నికల్లో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి తీసుకురావాలంటే అందుకు ప్రజాభిప్రాయ సేకరణ జరిపి, ఈవీఎంలను బ్యాలెట్ పేపర్‌తో మార్చడంలో తప్పులేదన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

REAL ESTATE

HOUSE FOR SALE

■ గుంటూరు జీరో లైన్, నల్లచెరువు, సంపత్‌నగర్ వెళ్లే రోడ్డుకు దగ్గరలో బీ.ఫామ్ 78గజాలు కింద డబుల్ బెడ్ రూమ్, పైన రేకులతో రెండు పోర్షన్ ఇల్లు 45లక్షలకు అమ్మబడును. 9959920729

LAND FOR SALE

■ 'మెగా ఆవకాడో ఫామ్‌ల్యాండ్' 11సెంట్లు 5 లక్షలు మాత్రమే. 5 నుండి 60 సంవత్సరముల వరకు ఎటా 2 నుండి 5 లక్షల ఆదాయం పొందవచ్చు. ఫోన్: 9133574455

WANTED

■ శ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. శ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18–28సం॥లోపు. 9133444989/ 88

■ స్వామి వివేకానంద గ్రూపు (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9502501122, 9573691122

■ లో బడ్జెట్ ప్లాట్లు సేల్ చేయుటకు మార్కెటింగ్ ఆఫీసర్స్, ఎగ్జిక్యూటివ్స్, టెలీ కాలర్స్ కావలెను. రిటైర్డ్ ఉద్యోగస్తులు, గృహిణులు, ఇన్సూరెన్స్ ఏజెంట్స్‌కు ప్రాధాన్యత. జీతం / కమీషన్ + ఇన్సెంటివ్స్. శ్రీ వసుధ డెవలపర్స్, గుంటూరు. 7893731464

■ మంగళగిరి తెనాలి ఏరియాలో పురుగు మందు కంపెనీలో పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15,000+3000. సంప్ర॥ 9121469383

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ 20K. ఫోన్: 8977639662, 8977639663

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

గుంటూరు 7075167663 7075167541

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పోరాటానికి, క్రమశిక్షణకు మారుపేరు యూటీఎఫ్

యూటీఎఫ్ సీనియర్ నాయకుడు జోజయ్య



విప్లవ నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సంఘ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పోరాటానికి, క్రమశిక్షణకు యూటీఎఫ్ మారుపేరుగా నిలిచిందని యూటీఎఫ్ సీనియర్ నాయకుడు కె.జోజయ్య అన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘ 52వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించిన జోజయ్య మాట్లాడుతూ యూటీఎఫ్ నిజాయతీకి, త్యాగానికి నిలయం అన్నారు. ఆవిర్భావం మొదలు క్రమశిక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, సంఘాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ సంస్కరణల రూపకల్పనలో అకడమిక్ అంశాలతో పాటు, ఉపాధ్యాయుల కృషి, సమాజ భాగస్వామ్యంలో రావలసిన మార్పులపై దృష్టి పెట్టాలని అన్నారు.
- మరో సీనియర్ నాయకుడు జి.ప్రభుదాస్ చెన్నుపాటి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ యూటీఎఫ్‌లో పని చేయడం ఎంతో గర్వకారణమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కార్యకర్తల్లో ఆ స్ఫూర్తి ఉంటుందన్నారు.

కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సీపీఎస్ కన్వీనర్ సీహెచ్ ఆదినారాయణ, జిల్లా కార్యదర్శులు ఎండీ షకీలా బేగం, కె.రంగారావు, బి. ప్రసాదు ఆడిట్ కమిటీ సభ్యులు కె.ప్రేమ్ కుమార్ రాష్ట్ర కౌన్సిలర్ బి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి మీదుగా వెళ్లే పలు రైళ్లు రద్దు

మరికొన్ని దారి మళ్లింపు

తెనాలిరూరల్: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కృష్ణా కెనాల్ నుంచి గూడూరు వరకు మూడో రైల్వేలైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెనాలి రైల్వే స్టేషన్ మీదుగా నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతోపాటు కొన్ని రైళ్లను దారి మళ్లించారు. ఈ నెలాఖరు వరకు ఈ మార్పులు అమల్లో ఉంటాయని, ప్రయాణికులు గమనించాలని తెనాలి రైల్వే స్టేషన్ మేనేజర్ టీవీ రమణ సూచించారు. 19వ తేదీ వరకు విజయవాడ నుంచి తెనాలి మీదుగా ఒంగోలు, గూడూరు వెళ్లే అన్ని ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఈనెల 24వ తేదీ వరకు గుంటూరు నుంచి తెనాలి మీదుగా రేపల్లె వెళ్లే అన్ని ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఈ నెల 11వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రేపల్లె–సికింద్రాబాద్ మధ్య నడిచే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైళ్లు గుంటూరు వరకు మాత్రమే నడుస్తాయి. 19వ తేదీ వరకు విశాఖపట్నం నుంచి లింగంపల్లి మధ్య తెనాలి మీదుగా నడిచే రెండు రైళ్లు నేరుగా గుంటూరు నుంచి విజయవాడకు వెళ్తాయని, తెనాలి వైపు రావని తెలిపారు.

రద్దు చేసిన మరికొన్ని రైళ్లు

- తిరుపతి–ఆదిలాబాద్ రైలు (17405/17406) ఆగస్టు 13 నుంచి 20 వరకు రద్దు.
- తిరుపతి–విశాఖపట్నం రైలు (22707/22708) ఆగస్టు 13 నుంచి18 వరకు రద్దు.
- తిరుపతి–నర్సాపూర్ (07131/07132) రైలు ఆగస్టు 17, 18 తేదీల్లో రద్దు
- విజయవాడ–గూడూరు (67225/67226) రైలు ఈ నెల 6 నుంచి 24 వరకు రద్దు
- గూడూరు–సికింద్రాబాద్ (12709/12710) రైలు ఈ నెల 14, 17, 18 తేదీల్లో రద్దు
- తిరుపతి–లింగంపల్లి (12733/12744) రైలు ఆగస్టు 17, 18, 19 తేదీల్లో రద్దు
- విజయవాడ–గూడూరు (12743/12744) ఆగస్టు 11వ తేదీ నుంచి 20 వరకు రద్దు
- నర్సాపూర్–ధర్మవరం (17247/17248) రైలు ఆగస్టు 11 నుంచి 19 వరకు రద్దు
- రేణిగుంట–కాకినాడ టౌన్ రైలు (17249/17250) ఆగస్టు 12 నుంచి19 వరకు రద్దు

దారి మళ్లించిన రైళ్లు

రేణిగుంట–నిజాముద్దీన్ (00761) రైలు ఈనెల 25, 26, 28 తేదీల్లో వయా కృష్ణాకెనాల్, న్యూ గుంటూరు, తెనాలి మీదుగా వెళుతుంది. హౌరా–తిరుపతి (20889) రైలు, పూరి–తిరుపతి (22859) రైలు ఈనెల 26న, సంత్రాగచి–తిరుపతి (22855) రైలు ఈ నెల 27న, తిరుపతి–భువనేశ్వర్ (22872) రైలు ఈ నెల 28న వయా కృష్ణాకెనాల్, న్యూ గుంటూరు, తెనాలి మీదుగా దారి మళ్లిస్తారు.

రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడిగా రమేష్ బాబు



రమేష్‌బాబును సన్మానిస్తున్న పలువురు నేతలు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల కేంద్ర సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశం ఆదివారం గుంటూరులోని ఏపీ ఎన్‌జీఓ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి 13 ఉమ్మడి జిల్లాల నుంచి ప్రభుత్వ డ్రైవర్లు హాజరయ్యారు. కేంద్ర సంఘ అధ్యక్షుడిగా ఉన్న సంసాని శ్రీనివాసరావు పై వచ్చిన అనేక ఆరోపణలు, అవినీతి కార్యకలాపాలపై చర్చించారు. రాష్ట్రంలో ఉన్న సభ్యుల సమస్యలు పరిష్కారం చేయనందున అవిశ్వాసం ప్రకటించి శ్రీనివాసరావును సంఘ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘ అధ్యక్షుడిగా పి. రమేష్ బాబును నియమిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. రమేష్ బాబు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల కేంద్ర సంఘ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. సంసాని శ్రీనివాసరావుకి ప్రభుత్వం కల్పించిన ఓడీ సదుపాయాన్ని రద్దు చేయాలని కోరుతూ తీర్మానించారు. రమేష్ బాబును గుంటూరు జిల్లా ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, స్టేట్. వైస్ ప్రెసిడెంట్. షేక్ నాగూర్ షరీఫ్, సిటీ అధ్యక్షుడు సూరి, ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్ కాన్ఫిడేషన్ జాతీయ అధ్యక్షుడు వై నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.